క్లుప్తంగా

కేసులు నమోదు చేస్తాం
ఏఓ నిశాంత్ కుమార్


ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

షాద్‌నగర్ రూరల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏఓ నిశాంత్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్, విత్తన విక్రయడీలర్ల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన విత్తనాలను విక్రయించొద్దని, రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో విధిగా రసీదు ఇవ్వాలని సూచించారు. రసీదులో తప్పనిసరిగ్గా ధర, లాట్ నెంబర్, కాల పరిమితి నమోదుచేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతిరోజు విత్తనాల స్టాకు వివరాలను నమోదు చేయాలని సూచించారు.

కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధిత రైతు
న్యాయం చేయాలని ఫిర్యాదు

కొందుర్గు: తాను బతికుండగానే తన భూమిని పట్టా మార్చారని ఫిర్యాదు చేస్తూ ఓ రైతు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన గడ్డం వెంకటయ్యకు సంబంధించిన 30గుంటలభూమిని రెవెన్యూ రికార్డుల్లో పట్టా మార్పిడి చేశారు. ఈ ఘటనలో పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశారు. మిగతా ఆరుగురిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయాడు. అదేవిధంగా తన భూమిని తన పేరున ఇప్పటికీ మార్పిడి చేయలేదని వెంకటయ్య వాపోయారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం మండలంలోని ముర్తూజగూడ, ఎనికేపల్లి, మొయినాబాద్-2, ఎస్‌పీఎస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మొయినాబాద్, పెద్దమంగళారం, అమీర్‌గూడ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా ఫీడర్ల పరిధిలోని ఎనికేపల్లి, ముర్తూజగూడ, నజీబ్‌నగర్, జీవన్‌గూడ, హిమాయత్‌నగర్, పెద్దమంగళారం, విజయ్‌నగర్ కాలనీ, మొయినాబాద్‌టౌన్, అమీర్‌గూడ గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

కళాకారులకు ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లిలో ఇటీవల రామాయణం స్టేజి నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ నాటక ప్రదర్శన ఖర్చుల నిమిత్తం శుక్రవారం ప్రోత్సాహక రూపకంగా రూ.5000 కళాకారులకు అందజేశారు. కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మల్లేశ్, బాలస్వామి, చంద్రమౌళి, విజయ్, కుమార్, శేఖర్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండికి చెందిన నిరుపేద జర్పుల సీత్యానాయక్‌కి గ్రామానికి చెందిన కేతావత్ కిషన్‌నాయక్ చేయూతనందించారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీత్యానాయక్‌కు 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. భవిష్యత్‌లోనూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అమర్‌సింగ్, తులసీరాం, భోని శంకర్, రమేష్, వినోద్, పరంసింగ్, సాయి, రవి తదితరులు ఉన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు: ఏఓ

ఆమనగల్లు: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ మహేంద్ర ఫర్టిలైజర్స్, సూర్య అగ్రిషాప్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగులమందులకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లు, బిల్లులు, రసీదు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. షాపుల యజమానులు స్టాక్ రిజిస్టర్‌ను విధిగా నమోదు చేయాలన్నారు. డీలర్లు జంగయ్య, సురేశ్ తదితరులు ఉన్నారు.

నేడు రైతు అవగాహన సదస్సు

మంచాల: మండల పరిధిలోని నోములలో వానాకాలం పంటల సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి జ్యోతి శ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నోముల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే ఈ సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

ఔషధ ఫలం నేరేడు!

- సీజనల్‌గా లభ్యం
- జోరుగా విక్రయాలు
- ఆరోగ్యానికి ఎంతో మేలు
- జీర్ణశక్తి పెరుగుతుంది
- ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


మార్కెట్‌లో అమ్ముతున్న పండ్ల వ్యాపారి

షాద్‌నగర్: అల్లనేరేడును ఔషధ ఫలంగా పిలుస్తారు. వేసవిలో ఎక్కువగా లభిస్తుంది. ఇవి వగరు, తీపి, పులుపు మేళవింపు రుచితో ఉంటాయి. ఈ పండ్లతో ఆరోగ్యానికి ఎంతో మేలు. వేసవిలో వేడిమి నుంచి ఉపశమనం కలిగించి చలువను అందిస్తాయి.

ఆకలిని పెంచుతుంది.. పైత్యం తగ్గిస్తుంది..

ఈ పండ్లను తినడం వల్ల ఆకలిని పెంచుతుంది. శరీరంలో ఉండే పైత్యాన్ని తగ్గిస్తుంది. గుండె, రక్తంలోని ఉష్ణాన్ని తగ్గిస్తుందని వైద్యులు చెబుతున్నారు. వీటిని తినేందుకు చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. కొందరు చెట్ల నుంచి నేరుగా తెంపుకొని తినేందుకు ఇష్టపడుతుంటారు.

ఉపయోగాలెన్నో..

- సీజనల్‌గా లభించే వీటిని తినడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. కేవలం పండ్లే కాదు చెట్ల ఆకులు, కాండంకూడా ఔషధంగా ఉపయోగపడుతుంది.
- శుభకార్యాల్లో అల్లనేరేడు ఆకులను కడితే సూక్ష్మ క్రిములు దరి చేరవు
- అల్లనేరేడు చెక్క నుంచి తీసిన కషాయం అతిసారం, నీళ్లవిరేచనాలు, జ్వరం వంటి వాటిని తగ్గిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.
- వీటిలో 'సీ' విటమిన్ పుష్కలంగా ఉండటంతో షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా తినడం ఎంతో మంచిదని వైద్యులు పేర్కొన్నారు.
- అల్లనేరేడు పండ్ల విత్తనాలను ఎండ బెట్టి చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం నివారించొచ్చని, నోటి దుర్వాసన పోగొడుతుందని, చెట్టు పుల్లలతో పల్లు తోమితే చిగుళ్ల ఆరోగ్యంగా ఉంటాయని వైద్యులు తెలిపారు.

అనేక రకాలు మొక్కలు..

ప్రస్తుతం అల్లనేరేడుకు సంబంధించిన మొక్కలు మార్కెట్‌లో పుష్కలంగా లభిస్తున్నాయి. చాలా మంది ఇళ్లలో, పెరట్లో, వ్యవసాయ క్షేత్రాల్లో నాటేందుకు ప్రత్యేకంగా ఆసక్తి కనబరుస్తున్నారు. కొందరైతే తోటల్లో పెంచేస్తున్నారు. గతంలో అల్లనేరేడు చెట్లు అంటే పెద్దగా కనిపించేవి కావు. ప్రస్తుతం మార్కెట్‌లో హైబ్రీడ్ మొక్కలు లభిస్తున్నాయి. హైబ్రీడ్ మొక్కలను నాటేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. అల్లనేరేడు పండ్లకు మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉండడంతో చాలా మంది రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో విధిగా ఈ మొక్కలను నాటుతున్నారు.

ధర ఎక్కువైనా తీసుకుంటాం



సీజనల్‌గా వచ్చే అల్లనేరుడు పండ్లు అంటే ఎంతో ఇష్టం. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మార్కెట్‌లో ధర ఎక్కువైనా వీటిని కొనుగోలు చేస్తాం ఇంట్లో అందరం తింటాం.

– ప్రకాశ్, షాద్‌నగర్

ఆరోగ్యానికి మంచిది

అల్లనేరేడు పండ్లలో ఔషధ గుణాలు ఉండడమే కాకుండా ఇది సీజనల్‌గా లభిస్తుంది. పండ్లను ఇష్టపడే వారు వీటిని తప్పకుండా కొనుగోలు చేస్తారు. సీజనల్ పండ్లను తినాలని వైద్యులు కూడా చెబుతుంటారు. దీంతో ఇది సీజనల్‌గా దొరకడమే కాక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఎండా కాలంలో వచ్చే ఈ పండ్లను తప్పకుండా తీసుకుంటాం.

– నర్సింహ్మ, షాద్‌నగర్

జోరుగా విక్రయాలు

షాద్‌నగర్‌లో రైతులు మామిడి, జామ తోటల్లో అల్లనేరేడు చెట్లను కూడా పెంచుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఈ పండ్లు అధికంగా లభిస్తున్నాయి. ప్రస్తుతం అల్లనేరుడు పండ్ల దిగుబడి ప్రారంభం అయ్యింది. రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా సరే గంపల్లో, తోపుడు బండ్లపై అల్లనేరేడు పండ్లను విక్రయిస్తున్నారు. కిలో రూ. 200ల వరకు పలుకుంది. పండ్లు పెద్దగా ఉంటే ధర ఎక్కువగా ఉంటుంది. ధర ఎక్కువైనా వాటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు వెనుకంజ వేయడం లేదు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజేశ్ డిమాండ్


మాట్లాడుతున్న పీడీఎస్‌యు నాయకులు

చేవెళ్ల: పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన విద్యార్థి సంఘం నాయకుడిపై దాడి చేసిన పోలీస్ కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె రాజేశ్ డిమాండ్ చేశారు. చేవెళ్లలో శుక్రవారం తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి సంఘం నాయకుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండాల్సింది పోయి పోలీసులే ఇబ్బందులకు గురిచేయటం బాధాకరమన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటనలో పోలీసుల తీరుపై ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయన్నారు. తాండూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాస్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడిచేసిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వైకుంఠధామాలు ఉపయోగకరంగా ఉండాలి

ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి



వైకుంఠధామంలో శుభ్రం చేయిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైకుంఠధామాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని మండల ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామాన్ని ఆయన సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శి సంధ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా వైకుంఠధామాన్ని సందర్శించి అక్కడ ఉన్న పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. డంపింగ్ యార్డును పరిశీలించి గ్రామాల్లోని చెత్త నేరుగా డంపింగ్ యార్డుకు చేరేలా చూడాలన్నారు. రోడ్డు పక్కన వేసిన చెత్తను తగులబెట్టొద్దన్నారు.

ముఖ్యంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉన్నప్పుడు ప్రజలు ఆ అధికారులను గుర్తిస్తారన్నారు. హిమాయత్‌నగర్‌లోని కాలనీల్లో రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందే
- ఎంపీపీ కొప్పు సుకన్య


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనాల్సిందేనని ఎంపీపీ కొప్పు సుకన్య అధికారులకు సూచించారు. యాచారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు చేస్తున్నారా.. తడిసిన ధాన్యం పేరుతో ఇబ్బందులు గురి చేస్తున్నారా.. ధాన్యం విక్రయించినవారికి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు ఉంటున్నాయా... తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు పెడుతున్నారని, తేమ పేరుతో త్వరగా కొనుగోలు చేయడం లేదని ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనాల్సిందేనని సర్కార్ చెబుతుంటే మీకు అభ్యంతరమేంటి అని అధికారులను నిలదీశారు. ధాన్యం మొత్తం కొనుగోలు చేయకపోతే ఆందోళన చేపడతామన్నారు. అనంతరం యాచారంలోని వన నర్సరీని ఎంపీపీ సందర్శించారు. వర్షాలు కురిసే లోపు ఉపాధి కూలీల ద్వారా గుంతలు తీయించాలని ఈజీఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, యాచారం పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య ఉన్నారు.

రికార్డులను పునఃపరిశీలన చేయండి

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రాకేశ్


షాద్‌నగర్ ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రాకేశ్ తదితరులు

కేశంపేట: సర్కారిపట్టా, పోరంబోకుగా ఉన్న రికార్డులను తారుమారు చేసి పట్టాభూమిగా మార్చుకున్న ప్రభుత్వ భూముల రికార్డులను పునఃపరిశీలన చేయాలని ఆర్డీఓ వెంకట మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రాకేశ్ షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని దత్తాయపల్లి రెవెన్యూ శివారులోని సర్వేనంబర్ 27లో 3ఎకరాల 16గుంటల భూమి పలు రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైనట్లు వినతిపత్రంలో తెలిపారు. ఇట్టి భూమిని గ్రామానికి చెందిన కొందరు రికార్డులను తారుమారు చేసి పట్టాభూమిగా మార్చుకొని అమ్మకం చేశారన్నారు. మళ్లీ ఆ భూమిని అమ్మేందుకు సిద్ధమయ్యారని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో అదే సర్వేనంబర్‌లో పాత ఊరు ఉండేదని, రికార్డుల్లో చింతల సర్కారి భూమిగా నమోదైనట్లు ఆయన తెలిపారు. ఇట్టి భూమి విషయంలో గత రికార్డులను మళ్లీ పరిశీలించి కబ్జాదారులనుంచి రికవరీ చేసుకోవాలన్నారు. గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకోసం ఆ భూమిని కేటాయించాలని కోరారు. ఆర్డీఓకు వినతిపత్రం అందించిన వారిలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కోకన్వీనర్ నర్సింహ్మ, నరేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు చర్యలు

ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్‌రావు

సాక్షి ఎఫెక్టు

షాద్‌నగర్: రహదారుల మరమ్మతులకు మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటునకు తగిన చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న సాక్షి దినపత్రిలో 'మలుపులు.. ప్రమాద ఘంటికలు' అనే కథనానికి ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్‌రావు స్పందించారు. షాద్‌నగర్ – కేశంపేట, ఆమన్‌గల్ రోడ్డు మరమ్మతులకు గాను రూ.15కోట్లు మంజూరైనట్లు, ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. మంజూరైన నిధుల్లో రోడ్డు భద్రతకు సంబంధించిన పనులు చేపడుతామని తెలిపారు. అదేవిధంగా రోడ్డు మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు. షాద్‌నగర్–జేపీ దర్గా రోడ్డుకు గాను, అత్యవసర రోడ్లపై, రోడ్డు భద్రత పనులు కోసం రూ.2,95,00,000తో అంచనా వ్యయం తయారు చేసినట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పుస్తెమట్టెలు అందజేత

మొయినాబాద్: మండల పరిధిలోని మోత్కుపల్లికి చెందిన ఎర్ర లచ్చయ్య, సత్తమ్మ దంపతుల కుమారుడు ఎర్ర శ్రీకాంత్ వివాహం సందర్భంగా మాజీ సర్పంచ్ రత్నం పుస్తెమట్టెలు అందజేశారు. శుక్రవారం శ్రీకాంత్ వివాహం సందర్భంగా ఉదయం అతని తల్లిదండ్రులకు పుస్తెమట్టెలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రత్నం మాట్లాడుతూ గ్రామంలో యువకుల పెళ్లికి పుస్తెమట్టెలు, యువతుల వివాహానికి పెళ్లి కానుక పేరుతో రూ.10,116 అందజేస్తున్నామన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభం

ఉద్యానశాఖ అధికారి వి అశోక్


తాళ్లపల్లి రైతు వేదికలో మాట్లాడుతున్న అశోక్

షాబాద్: ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తే రైతులకు అధిక లాభం చేకూరుతుందని చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి వి అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి రైతు వేదికలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలను, మిగతా పంటలతో పోల్చితే వాటి వల్ల కలిగే ఉపయోగాలను కూలంకుశంగా వివరించారు. ఆయిల్ పామ్‌కు సంబంధించి అనుకూల నేలలు, నీటి లభ్యత, నాటువిధానంపై సాగు నీటి యాజమాన్యం ఎరువుల వినియోగం, అంతర పంటలు, గెలల దిగుబడి, కోతలకు సంబంధిచిన వివరాలు రైతులకు వివరించామన్నారు. నీరు తేలికగా ఇంకిపోయే గుణం ఉన్న నేలలు అనుకూలంగా ఉంటాయన్నారు. సాగునీరు సమృద్ధిగా ఉండాలని, 9 మీటర్ల దూరం ఉండేలా త్రిభుజాకార లేదా చతురస్రాకార పద్ధతిలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. రైతులు అందుబాటులో ఉన్న ఆయిల్‌పామ్ ఫీల్డ్‌ఆఫీసర్‌కు, ఏఈఓకు, హార్టికల్చర్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గీతా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

విద్యుత్ ఏఈకి కొత్తపల్లి గ్రామస్తుల వినతి

యాచారం: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా తెగిపోయిన విద్యుత్ తీగలు, ఓపెన్ ట్రాన్స్‌ఫారమ్‌ల వద్ద ఫెన్సింగ్ తదితర పనులను వెంటనే చేపట్టాలని కొత్తపల్లి గ్రామస్తులు శుక్రవారం విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్, ఆఫ్ సిస్టమ్ లేదని, మిషన్ భగీరథ నీటి సరఫరాకు 24 గంటల విద్యుత్ సరఫరా ఉందని తెలిపారు. గ్రామంలోని పలు కాలనీల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయని తెలిపారు. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ జగన్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


విత్తనాలను రైతులకు అందిస్తున్న వ్యవసాయాధికారిణి తులసి

చేవెళ్ల: 60శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి తులసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం అధికంగా తెప్పించినట్లు చెప్పారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకొని రైతు వేదికల వద్ద ఏఈఓలను కలిసి పర్మిట్ రాయించుకోవాలన్నారు. స్టాక్ ఉన్నంత వరకు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. అవసరం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్మిట్‌లు ఒక చోట విత్తనాలు మరోచోట

వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువు విత్తనాల పంపిణీ రైతులను ఇబ్బందులకు గురి చేసింది. విత్తనాలు ఒక చోట పర్మిట్‌లు మరోచోట పెట్టడంతో వాటిని తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ముడిమ్యాల పీఏసీఎస్ గోదాం వద్ద మండలానికి కావాల్సిన జనుము, జీలుగ విత్తనాలను అందుబాటులో పెట్టి వాటిని అధికారులు రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు వారివారి రైతువేదికల వద్ద ఉన్న ఏఈఓల వద్ద విత్తనాలకోసం పర్మిట్లను రాయించుకొని ముడిమ్యాల వద్ద విత్తనాలను తీసుకెళ్లారు. వాహనాలు లేని రైతులు ఒక బస్తా విత్తనాలకోసం ముడిమ్యాల పీఏసీఎస్ వరకు వచ్చేందుకు రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారు. రైతు వేదికల వద్దనే ఈ విత్తనాలను అందుబాటులో పెట్టి ఉంటే బాగుండేదని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంలో వ్యవసాధికారులు స్పందించి రైతులకు అందుబాటులో పంపిణీ చేయాలని కోరారు.

కూలీలకు పే స్లిప్పులు అందజేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

యాచారం: ఉపాధి పనులు చేసిన కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మాల్ గ్రామంలో శుక్రవారం ఉపాధి పనుల వద్దకెళ్లి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు నింబంధనలు సక్రమంగా పాటించకపోవడంతోనే ఉపాధి పనులకు వెళ్లాలంటే కూలీలు ఆసక్తి చూపడం లేదని అన్నారు. కూలీలకు బిల్లులు ఇవ్వకూడదనే ఉద్దేశ్యంతోనే అధికారులు పేస్లిప్పులు సకాలంలో ఇవ్వడం లేదని అన్నారు. కూలీలు ఉపాధి పనులు చేసి నెలలు గడిచినా కూడ బిల్లులు రాకపోవడంతోనే పస్తులుండాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించడం లేదు, ఉపాధి పనులు చేసే ప్రాంతాలు గ్రామాలకు చాలా దూరంలో ఉండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ వాహనాల్లో అద్దెలు చెల్లించి పనులకు పోతున్నారని అన్నారు. ఉపాధి కూలీల సమస్యలపై శనివారం మాల్ గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అంతకు ముందు డీఆర్‌డీఓ శ్రీలత, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి కూలీల సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు..యాదయ్య, ఇందిరమ్మ, సాయిలు, పర్వతాలు, శేఖర్, వెంకటయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.